## ఘనంగా అభయ ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం



**అల్లవరం,పెన్ పవర్,మార్చి9:**దేవగుప్తం సెంటల్లో కొలువైయున్న ఘనంగా శ్రీ అభయ ఆంజనేయ స్వామి ప్రథమ ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పోచినపెద్ది సందీప్ ఆధ్వర్యంలో పెచ్చెట్టి జానకిరామయ్య, రాంబాబు, పట్టాభిరామయ్య, లక్ష్మీనారాయణ, నాని దంపతులచే స్వామివారికి గణపతి పూజ,పంచామృత అభిషేకం,తమలపాకుల పూజ, గంధంతో ఆర్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించి, భక్తులకు తీర్ధ ప్రసాదాలు వితరణ చేశారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పీజీఆర్ఎస్‌కు 450 అర్జీలు రాక





- రెవెన్యూ క్లినిక్‌కు 25 అర్జీలు
- సకాలంలో నాణ్యతతో అర్జీల పరిష్కారం చేయాలి
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, పెన్ పవర్,మార్చి 09:**ప్రజా సమస్యలపై అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, సీపీవో పీ. త్రినాథ్, డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ డా. జె. నరసింహా నాయక్, జిల్లా ఉపాధి అధికారి జి. శ్రీనివాసరావు, డీఎల్పీవో వాసుదేవరావు తదితర అధికారులు పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బియ్యం కార్డుల మంజూరు, కార్డులలో పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ అవకాశాలు, మురికికాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్లు మరియు కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 450 అర్జీలు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు రావడానికి గల కారణాలను సంబంధిత అధికారులు అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. అలాగే శాఖల వారీగా పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రెవెన్యూ క్లినిక్‌కు 25 అర్జీలు

రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా సోమవారం పీజీఆర్ఎస్‌లో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో తిప్పే నాయక్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి. రత్నమణి, పెద్దాపురం ఆర్డీవో ఎన్. శ్రీధర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రీ సర్వే, భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏ భూములు, సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలపై మొత్తం 25 అర్జీలు అందాయని డీఆర్వో తెలిపారు.

కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి వాటిని గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు కడసారి గౌరవం...
## పాడె మోసిన మంత్రి సుభాష్

వేగాయమ్మపేటలో టేకుమూడి వెంకటరమణ అంత్యక్రియల్లో మంత్రి సుభాష్ పాల్గొని నివాళులు



**రామచంద్రపురం, పెన్ పవర్,మార్చి 9:**

కుటుంబ పెద్దను కోల్పోయి కష్టకాలంలో ఉన్న కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు.రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలోని రూరల్ మండలం వేగాయమ్మపేట గ్రామానికి చెందిన గ్రామ అధ్యక్షుడు టేకుమూడి వెంకటరమణ అకాల మరణం చెందడంతో మంత్రి సుభాష్ సోమవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ స్వయంగా వెంకటరమణ పాడె మోసి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం పార్థివ దేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి గౌరవ నివాళులు అర్పించారు. తరువాత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు టేకుమూడి వెంకటరమణ పార్టీకి అండగా నిలబడి నిస్వార్థంగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, మాజీ అధ్యక్షులు పితాని భద్రరావు, కూటమి పార్టీ నాయకులు మేకా జానకిరామయ్య, బొమ్ము బాలకృష్ణ, గారపాటి జోగారావు, కొమరిన బాబి తదితరులు పాల్గొని వెంకటరమణకు నివాళులు అర్పించారు.

## పాపారాయుడుకు మాజీ ఎంపీ అనురాధ పరామర్శ



**మండపేట. పెన్ పవర్. మార్చ్ 9 :**అర్తమూరు మాజీ సర్పంచ్ పడాల భూలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ చింతా అనురాధ సోమవారం పరామర్శించారు. సోదరి వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర వైసీపీ కార్యదర్శి, రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడును కూడా పరామర్శించారు. కోళ్ల రైతు సంక్షేమ సంఘం నాయకుడు, పౌల్ట్రీ పరిశ్రమ నాయకుడు పడాల సుబ్బారెడ్డి నివాసంలో స్వర్గీయ భూలక్ష్మి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు సత్తి బులిస్వామి రెడ్డి, వైసీపీ ఎస్సి సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్, జడ్పీటీసీ కురుపూడి భవాని రాంబాబు, సాధనాల శివ భగవాన్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.





**-ప్రత్తిపాడు వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ మార్చి 09:** శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండల కేంద్రమైన రౌతులపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారిని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన స్వామివారిని వేడుకున్నారు.భగవంతుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని, అందరూ ఐక్యమత్యంతో అభివృద్ధి పథంలో సాగాలని కోరుకున్నారు.అనంతరం ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు శ్రీ కేదరశెట్టి నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులను కలిసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండల వైసీపీ అధ్యక్షులు చింతకాయల సత్యనారాయణ ,వైసిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.అనంతరం గిడజాం గ్రామంలో శ్రీ గంగాలమ్మ తల్లి ఆలయ ధర్మకర్త పడాల గిరిబాబు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న గంగాలమ్మ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో ముద్రగడ గిరిబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు చేసే దొంగలు అరెస్టు




- రూ.32.40 లక్షల బంగారం, వెండి స్వాధీనం.
- ఎస్సై నరేష్ బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ.

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 09;**ఆలమూరు మండలంలో రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల దొంగల ముఠాను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేసి భారీ ఎత్తున బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా (ఐపీఎస్) వివరాలు వెల్లడించారు. గత నెల ఫిబ్రవరి 14న పెనికేరు గ్రామనికి జిత్తుక లక్ష్మీ పార్వతి అనే మహిళ ఫిర్యాదు మేరకు ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో కంచెర్ల జార్జ్ బెన్నీ (22), సన్నపు శ్రీ చరణ్ (20) ఇద్దరూ ఆలమూరు మండలం పెద్దపళ్ళ గ్రామానికి చెందినవారు కాగా, ఉండుర్తి ఆనంద్ కుమార్ (22) కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందినవాడు. నిందితుల వద్ద నుండి పోలీసులు 203.650 గ్రాముల బంగారం, 765 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోగా వాటి మొత్తం విలువ సుమారు రూ.32,40,000 ఉంటుందని అంచనా వేశారు. నిందితులలో ఒకరైన జార్జ్ బెన్నీపై గతంలో ఆలమూరు,రావులపాలెం పోలీస్ స్టేషన్లలో దొంగతనం, గంజాయి కేసులు నమోదై ఉండగా, ఆనంద్ కుమార్‌పై కూడా గంజాయి కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించిన కొత్తపేట ఎస్డిపిఓ సుంకర మురళీ మోహన్, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, అమలాపురం సిసిఎస్ సిఐ గజేంద్ర కుమార్, ఆలమూరు ఎస్సై నరేష్ బృందాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో “మహిళా దినోత్సవ వేడుకలు






**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 9:** “అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని” పురస్కరించుకుని స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుమారి పరుచూరి రాజశ్రీ, క్యాంపస్ లీడ్ – టెక్నికల్ ఐ.టి ఒ స్పెషలైజ్డ్ హైరింగ్, టి.సి.ఎస్, వారు ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా॥పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా ఉండే మహిళలకు మరియు తమ కళాశాల మహిళా సిబ్బందికి తన హృదయపూర్వక శు భాభివందనాలను తెలియజేసారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనపరచిన విద్యార్థినులను ప్రశంసించారు.

ముఖ్య అతిదిగా విచ్చేసిన కుమారి పరుచూరి రాజశ్రీ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ సమాజంలో మహిళా శక్తి అన్ని రంగాలలో విస్తరించి ప్రపంచ పురోగతిలో కీలకపాత్ర వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆత్మ విశ్వాసం మరియు ఆత్మ గౌరవం తో వారి నైపుణ్యాలను మెరుగుపరచుకుని ఉన్నత విద్య మరియు ఉద్యోగావకాశాలు వంటి వాటిలో ముందంజ వేయాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకుని వారి ఎదుగుదలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎం. వి. హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరక్టర్–అకడమిక్స్ డా॥ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా॥ జి.నరేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా॥ వై.జయబాబు, డీన్–సి.డి.సి. డా॥ ఎం. రాధికామణి, ఉమెన్ ఎంపవర్మెంట్ ఒ గ్రీవెన్స్ సెల్ సభ్యులు, వివిధ విభాగాధిపతులు, కళాశాల మహిళా ఉద్యోగినులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఈనెల 13న పీఎం కిసాన్ డబ్బులు జమ



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 9:** ఈనెల 13వ తేదీన కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ 22వ విడత సొమ్ము చెల్లించనుందని జగ్గంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడు దఫాలుగా రూ. 2వేలు చొప్పున సంవత్సరానికి రూ. 6వేలు ఇస్తుందన్నారు. ఈ సంవత్సరం ఆఖరి విడత రూ.2వేలు ఈనెల 13న ప్రధానమంత్రి మోడీ విడుదల చేస్తారన్నారు. ఈ విషయాన్ని రైతులంతా గమనించి ఆ సొమ్మును వ్యవసాయ పనులకు వాడుకోవాలని ఏడిఏ శ్రీనివాస్ కోరారు.

# ఆదిత్య యూనివర్సిటీ లో “వాట్ మేక్స్ మెడిసిన్” అనే అంశంపై సదస్సు





**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 9:**గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయం లోని ఫార్మసీ విభాగం మరియు ఇంటర్నేషనల్ రిలేషన్స్ విభాగం ఆధ్వర్యంలో “వాట్ మేక్స్ మెడిసిన్?” అనే అంశంపై ఒక గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికా యూనివర్సిటీ ఆఫ్ అలబామాలో డిస్టింగ్విష్డ్ యూనివర్సిటీ రీసెర్చ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ప్రముఖ శాస్త్రవేత్త డా. ఎం.ఎన్.వి. రవి కుమార్ పాల్గొన్నారు అని తెలిపారు. ఈ సందర్భంగా డా. ఎం.ఎన్.వి. రవికుమార్ ఆధునిక ఔషధాల వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలు, ఔషధాల అన్వేషణ మరియు అభివృద్ధి ప్రక్రియ, అలాగే నానో మెడిసిన్ వంటి ఆధునిక సాంకేతికతను భవిష్యత్ వైద్యరంగాన్ని ఎలా మారుస్తున్నాయో విద్యార్థులకు వివరించారు. అంతర శాఖ పరిశోధన ప్రాముఖ్యతను కూడా ఆయన వివరించి, ఫార్మసీ విద్యార్థులు పరిశోధన మరియు ఆవిష్కరణల వైపు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండు కళాశాలలకు చెందిన బి.ఫార్మసీ విద్యార్థులు సుమారు 250 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ డా. డి. సతీష్ కుమార్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డా. రంజిత్ కుమార్ మరియు ఫార్మసీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

# పునర్వినియోగ వంట నూనెలపై నిఘా

## హోటల్ యజమానులకు ఆహార భద్రతా శాఖ హెచ్చరిక




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 9:**
అమలాపురం పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో వాడిన వంట నూనెను తిరిగి వాడటం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉందని జిల్లా ఆహార భద్రతా అధికారి హెచ్చరించారు. అమలాపురంలో హోటల్, రెస్టారెంట్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఒకసారి వాడిన నూనెను పదేపదే వేడి చేసి వాడటం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. హోటళ్లలో మిగిలిపోయిన వాడిన నూనెను ఇష్టానుసారంగా నిల్వ ఉంచడం లేదా ఇతరులకు విక్రయించడం నిషేధించబడిందన్నారు వాడిన వంట నూనెను కేవలం ప్రభుత్వం గుర్తించిన అధీకృత ఏజెన్సీలకు మాత్రమే అప్పగించాలని ఆదేశించారు. ?ప్రతి హోటల్, రెస్టారెంట్ యాజమాన్యం తమ వద్ద ఎంత నూనె వినియోగించారు, ఎంత మిగిలింది, దానిని ఏ ఏజెన్సీకి ఇచ్చారు అనే వివరాలతో కూడిన రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా శాఖ హెచ్చరించింది. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బోనం సత్తిబాబు, నల్లా పవన్ కుమార్, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హోటల్ యజమానులు పాల్గొన్నారు.

# డాక్టర్ వెంపరాల శారదా రాణిని సత్కరించిన



- రాష్ట్ర సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల బోర్డు డైరెక్టర్
- అంబటి భూలక్ష్మి

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 9:**మెరుగైన వైద్య సేవలను అందిస్తూ కోనసీమ ప్రాంతంలోనే మంచి హస్తవాసి ఉన్న వైద్యురాలిగా పేరుగాంచిన ప్రముఖ హాస్పిటల్ రోహిణి హాస్పిటల్ డాక్టర్ వెంపరాల శారదా రాణిని మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల బోర్డు డైరెక్టర్ అంబటి భూలక్ష్మి కోటేశ్వరరావు సత్కరించారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఎప్పటికప్పుడు వైద్య సూచనలు ఇస్తూ మెరుగైన వైద్య సేవలను అందిస్తూ కోనసీమ ప్రాంతంలోనే మంచి హస్తవాసి ఉన్న వైద్యురాలిగా పేరుగాంచిన శారదారాణి కి ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. అంబటి కోటేశ్వరరావు, అంబటి సత్య మణికంఠ పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఎనిమిది మందికి జైలు శిక్ష, జరిమానా




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 9:** జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరిని సోమవారం పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిలో ఐదుగురికి నాలుగు రోజుల చొప్పున మరొకరికి ఏడు రోజులు చొప్పున జైలు శిక్ష విధించారు. ఐదుగురిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించారు. మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఎవరైనా తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు హెచ్చరించారు.

# వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా రాచర్ల రమేష్ నియామకం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 9:** వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా రాచర్ల రమేష్ ను పార్టీ అధిష్టానం నియమించడం పట్ల పలువురు పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఏలేశ్వరం పట్టణానికి చెందిన రాచర్ల రమేష్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు, ఏలేశ్వరం వైసిపి పట్టణ సీనియర్ నేత శిడగం వెంకటేశ్వరరావు, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి సతీష్ గోవింద బాబుల ఆశీస్సులతో పార్టీ అధిష్టానం వైసిపి జిల్లా ఎస్ సీ సెల్ కార్యదర్శిగా ఎంపిక కాబడినట్లు రాచర్ల రమేష్ సోమవారం స్థానిక మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ ను ముద్రగడ గిరి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలుపారు. “పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆయన అన్నారు. అనంతరం మీడియాతో రమేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కష్టపడి పని చేస్తానని నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో
పట్టణ వైసిపి పార్టీ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ , పేకల జాన్ బాబు, సఖిరెడ్డి బుజ్జి , లోగేష్ శేఖర్,సిరిపు రపు రాజేష్,లు రాచర్ల రమేష్ ను అభినందించారు.

# కోనసీమ జిల్లాలో భారీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

- వరుస చోరీలకు తెర..
- రూ.32.40 లక్షల సొత్తు స్వాధీనం,
- ముగ్గురి అరెస్ట్



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 9:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు అమలాపురం ఎస్పీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల వివరాలను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా వెల్లడించారు. ఫిబ్రవరి 14, 2026న ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 22/2026 (సెక్షన్లు 331(4), 305 దీబీఎ) కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టారు. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కంద్రె రాజు అలియాస్ చిన్న (22), ?సన్నపు వెంకట రమణ అలియాస్ వెంకన్న (20), ?ఉంద్రి ఆనంద్ కుమార్ (22) లు అరెస్టయిన నిందితులు.

నిందితుల వద్ద నుంచి సుమారు 203.650 గ్రాముల బంగారు ఆభరణాలు, 765 గ్రాముల వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 32,40,000 ఉంటుందని అంచనా. క్లిష్టమైన ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, సీసీఎస్ సీఐ గజేంద్ర, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

# మహిళా దినోత్సవంలో.....

* హక్కుల కోసం ధ్వజమెత్తిన సిపిఐ (ఎంఎల్) మహిళా సంఘం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 9:** పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంబరాలు స్థానిక సిపిఐ (ఎంఎల్) మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అయితే మహిళా దినోత్సవం వేడుకలు జరుపుతూనే మహిళ హక్కుల కోసం మహిళా సంఘాల ధ్వజమెత్తాయి. నాయకుల ఉపన్యాసాల్లో, కాగితాలపై మహిళలకు చేస్తున్న సేవలు, రాజ్యాధికారుల భాగస్వామ్యం, మహిళల సంక్షేమ అభివృద్ధిపై లెక్కలు గొప్పగా చూపిస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో మహిళలకు అవేమీ దక్కట్లేదు అని గళమెత్తారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏలేశ్వరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, బాలాజీ సబ్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాలు నాగమణి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం కానుకగా వంట గ్యాస్ రేటు పెంచిందని ఎద్దేవా చేశారు. మహిళలకు సమాన హక్కులు, అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని గొప్పలు చెప్తున్నా ప్రభుత్వాలు ఆచరణలో శూన్యమన్నారు. ఇటీవల అంగన్వాడి కార్యకర్తలు తమ న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తున్న మహిళలను నిర్దాక్షిణ్యంగ అరెస్టు చేయడం, ఉద్యమాన్ని అణిచివేయడం మహిళలకు దక్కిన గౌరవంగా భావించాలా అన్నారు. మహిళలకు రాజకీయ పదవులు రిజర్వేషన్ ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ స్థాయి నుండి అసెంబ్లీ వరకు మహిళ పదవులను అడ్డుపెట్టుకుని భర్తలైన మగవాళ్లే ఆధిపత్యం చలాయించడం నిజం కాదా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తే సరిపోదని, నిష్పక్షపాతంగా మహిళల హక్కులు రక్షించే విధంగా ప్రజాస్వామ్యం లో విలువలను కాపాడే వ్యవస్థ అవసరమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు ఏలేశ్వరం మండలం లోకల్ కమిటీ కార్యదర్శి గండేటి పెద నాగమణి, సహాయ కార్యదర్శి కందుల కృపా ప్రసాదు, కందుల వరలక్ష్మి, గోనాపు వరలక్ష్మి, పలపా సుందరి, గుమ్మడి పాదాలమ్మ,పశ్చిమల్ల సుబ్బలక్ష్మి, పల్లి బోయిన లక్ష్మి, పందిరి సుబ్బలక్ష్మి, ఇంజుమల్ల అప్పలరాజు, యలమర్తి మనీ,పందిరి లోవ ,చాచుపల్లి సీత, సంధక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తనవంతు కృషి.

* పలువురిని పరామర్శించిన వైసీపీ నాయకులు మురళీ కృష్ణంరాజు





**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 09:** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు.మండలంలోని ధర్మవరం గ్రామంలో చిలకలపల్లి రాంబాబు భార్య రమాదేవి ఇటీవల ఆకాల మృతి చెందారు.దీంతో విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు.భవిష్యత్తులో రాంబాబు ఇద్దరు పిల్లలకు ఏ అవసరం వచ్చినా తమ ట్రస్ట్ నుండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.అలాగే మద్రి రాముడు భార్య లక్ష్మి కుటుంబాన్ని,తూపాటి బుల్లచ్చయ్య భార్య పల్లయమ్మ కుటుంబీకులను కూడా పరామర్శించి ఆయా కుటుంబాల వారికి ప్రగడ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు,పోకనాటి శేషయ్య,మద్రి సుబ్బారావు,పోకనాటి నూకరాజు,జువ్వల దొరబాబు,దాడి పుత్తయ్య తదితరులు పాల్గొన్నారు

# నేతాజీ స్కూల్లో మహిళా దినోత్సవ వేడుకలు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 09;** మండలంలోని చెముడులంక, మడికి నేతాజీ విద్యాసంస్థలలో స్కూల్ కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్.లక్ష్మీ శ్రీదేవి, ఆలమూరు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బూసి విద్య ప్రసన్న, తణుకు విరించి స్కూల్ డైరెక్టర్ బడే లక్ష్మీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థులు భవిష్యత్తుకు ఉత్తమ ప్రణాళికలు రచించుకుని అత్యుత్తమ ప్రతిభ పాటవాలు కనబరిచి స్కూలుకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లులకు, మహిళ ఉపాధ్యాయులకు వివిధ ఆటల పోటీలు, క్విజ్జులు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వేడుకలలో పాల్గొన్న మహిళలు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారందరిని సత్కరించి మేముంటోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సంస్థల ప్రెసిడెంట్ తుమ్మ లక్ష్మి అరుణ, హెడ్ మాస్టర్ దూలం స్వామి, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ లంకలపల్లి ఆంజనేయులు, ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, రాజశేఖర్, పోలావతి, తదితరులు పాల్గొన్నారు.




## కరాటే పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 09;** ఈనెల 8వ తేదీన గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో వాసవి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ పోటీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తూరు సెంటర్ బ్లూ బెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు గెల్చుకున్నారు. ఆయా విభాగాల్లో భాగంగా ఏ విభాగంలో బొక్క మౌనిక శ్రీలత సిల్వర్ మెడల్, సి విభాగంలో కాశి సౌమ్య బ్రాంజ్ మెడల్, అదేవిధంగా డి విభాగంలో అడాల అరహ బ్రాంజ్ మెడల్, సాధించినట్లు మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను సోమవారం స్కూల్ కరస్పాండెంట్ ఇడుపుగంటి పద్మావతి,కోచ్ వెంకటలక్ష్మి, స్కూలు టీచర్స్, తదితరులు అభినందించారు

## పలువురికి వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శ.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, మార్చి 09:** రౌతులపూడి మండలం ములగపూడి గ్రామంలో పలువురిని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు సోమవారం పరామర్శించారు. ములగపూడి గ్రామానికి చెందిన అంకంరెడ్డి పాత్రుడు ఇటీవల కాలంలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి విషయం తెలుసుకున్న గిరిబాబు సోమవారం వారి నివాసానికి పాత్రుడును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదే గ్రామానికి చెందిన చింతకాయల వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గిరిబాబు వేణుని కలసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండల వైసిపి అధ్యక్షులు చింతకాయల సత్యనారాయణ స్థానిక వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

## 14 సంవత్సరాల బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్

# అవకాశం వినియోగించుకోవాలి




**మండపేట. పెన్ పవర్. మార్చ్ 9 :** 14 సంవత్సరాలు నిండిన బాలికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ అందిస్తున్నాయని, మండపేట నియోజకవర్గంలోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గర్భాశయ (సర్వైకల్) క్యాన్సర్ నివారణ కోసం 14 సంవత్సరాలు నిండిన బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, రోజుకు 20 మందికి మాత్రమే వ్యాక్సిన్ వేయబడుతుందని తెలిపారు. పట్టణంలోని యూపీహెచ్‌సీ కేంద్రాల్లో అలాగే మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పీహెచ్‌సీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని చెప్పారు. వ్యాక్సిన్ వేయించుకునే బాలికలు ముందురోజు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయంలో ఆధార్ కార్డు లేదా పుట్టినతేది ఉన్న సర్టిఫికేట్‌తో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ వ్యాక్సినేషన్ కోసం ది. 01-03-2011 నుండి ది. 28-02-2012 మధ్య జన్మించిన బాలికలు అర్హులని తెలియజేశారు. వ్యాక్సిన్ ఇవ్వడానికి ముందు తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతి తప్పనిసరి అని, వ్యాక్సిన్ తీసుకున్న అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేస్తారని చెప్పారు. సుమారు మూడు నెలల పాటు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందని, మండపేట నియోజకవర్గంలోని అర్హులైన బాలికల తల్లిదండ్రులు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల కోరారు.

## గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం నిరసన గళం




**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 9 :** వంటగ్యాస్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం సామాన్యుడి పాలిట శరాఘాతంలా మారిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో 'భారీ ధర్నా' నిర్వహించారు.

?ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ యుద్ధ పరిణామాలను సాకుగా చూపి, ప్రజలపై భారాలు మోపడం గమనార్హమని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న సామాన్య జనంపై గ్యాస్ ధరల భారం వేయడం పుండు మీద కారం చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 115 పెంచడం చిరు వ్యాపారుల పొట్ట కొట్టడమేనని, దీనివల్ల అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు అతలాకుతలం అవుతాయన్నారు. యుద్ధ పరిణామాలను అడ్డం పెట్టుకుని ప్రజల నుంచి పన్నుల రూపంలో దోపిడీ చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, కేంద్రానికి ఊపిరి పోస్తున్న టీడీపీ తక్షణమే ఈ ధరల ఉపసంహరణ కోసం ఒత్తిడి తేవాలన్నారు. పెంచిన ధరలను తక్షణమే వెనక్కి తీసుకోకుంటే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, కూనిరెడ్డి అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, రొంగల సుబ్బలక్ష్మి, యాసలపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

